సాక్షి
కామారెడ్డి
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



**కార్మికులకు భద్రతేది?**
పారిశుధ్య కార్మికులు చేతులకు గ్లౌజ్‌లు కూడా ధరించకుండానే పనులు చేయాల్సి వస్తోంది. దీంతో వారు ఇబ్బందిపడుతున్నారు.
- 8లో ▸



**ఉద్యాన పంటలతో లాభాలు**
ఉద్యాన పంటలతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని డీఆర్‌డీవో నురేందర్ పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /20.6

**వాతావరణం**
ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండతీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 'బాధ్యతాయుతంగా వ్యవహరించాలి'




**కామారెడ్డి క్రైం:** రిసెప్షన్ విధులు నిర్వహించే వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం రిసెప్షన్ వర్టికల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీఎస్‌లకు వచ్చే ఫిర్యాదును తక్షణమే నమోదు చేయాలన్నారు. దానికి వెంటనే రశీదు ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### 19న మామిడి చెట్ల కాత వేలం

**నాగిరెడ్డిపేట:** మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో 20 ఎకరాలలో గల మామిడి చెట్ల కాతను ఈనెల 19న వేలం వేయనున్నట్లు ఉద్యాన క్షేత్ర అధికారి కమలాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా వెయ్యి రూపాయల డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. 19న ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని తెలిపారు.

### గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



**తాడ్వాయి/రాజంపేట:** పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకా వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి సంజయ్ కుమార్ సూచించారు. బుధవారం తాడ్వాయి మండలంలోని దేవాయిపల్లి, రాజంపేట మండల కేంద్రంలలో నిర్వహించిన పశువైద్య శిబిరాలలో పాల్గొన్నారు. పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 15 వరకు అన్ని గ్రామాలలో పశువైద్య శిబిరాలు నిర్వహించి టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, మండల పశు వైద్యాధికారులు రమేశ్, అనిల్‌రెడ్డి, వీఎల్‌వో పోచయ్య, సిబ్బంది కొండల్‌రెడ్డి, ప్రేం సింగ్, రాజ వీరయ్య, రాజేశ్వర్, రమేశ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



**బాన్సువాడ రూరల్:** నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బుధవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందని ఇంటర్ కామారెడ్డి జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్ అన్నారు. న్యూ లాండ్ లాబరేటరీ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 17న ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 18న బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా ఉంటాయన్నారు. ప్రిన్సిపల్ శివ, అధ్యాపకులు స్వరూప్, సమీ, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రజాఖ్, లైబ్రేరియన్ కార్తిక్, న్యూలాండ్ ల్యాబరేటరీ సంస్థ ప్రతినిధులు, కళాశాల అభివృద్ధి కమిటి సభ్యులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన లిక్కర్ అమ్మకాలు

- ఊరూవాడా బెల్టుషాపులు విస్తరించినా పెరగని ఆదాయం
- మద్యం అమ్మకాలు తగ్గడానికి కారణాలు ఎన్నో..
- 'స్థానిక' ఎన్నికలపైనే ఎక్సైజ్ శాఖ ఆశలు

ఊరూవాడా విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నా.. జిల్లాలో మద్యం అమ్మకాలు మాత్రం తగ్గాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరంలో రూ. 8 కోట్ల ఆదాయం మాత్రమే పెరిగింది. మద్యం ధరలు పెరగడంతో మందుబాబులు గుడుంబా, గంజాయి వంటివాటిని సేవిస్తున్నట్లు తెలుస్తోంది. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



మద్యం అమ్మకాలను ఆర్థిక సంవత్సరానికి లెక్కిస్తారు. ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఎంత మద్యం అమ్మారు? ఎంత ఆదాయం వచ్చింది? అంతకుముందు సంవత్సరం ఎంత ఆదాయం వచ్చిందని పరిశీలించి, వచ్చే ఏడాది ఎంత ఆదాయం పెరగవచ్చో అంచనా వేసుకుంటారు. అయితే గత ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలు పెరిగినప్పటికీ ఆదాయం మాత్రం పెద్దగా పెరగకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 2023–24 సంవత్సరంలో జిల్లాలో మద్యం అమ్మకాల ద్వారా రూ. 551 కోట్ల ఆదాయం రాగా.. 2024–25 సంవత్సరంలో రూ. 559 కోట్లు మాత్రమే వచ్చింది. కేవలం రూ.8 కోట్ల ఆదాయం మాత్రమే పెరిగింది. పెరిగిన మద్యం ధరలకు అనుగుణంగా ఆదాయం భారీగా పెరగాల్సి ఉన్నా ఆ స్థాయిలో ఆదాయం పెరగకపోవడం గమనార్హం.

జిల్లాలో 49 వైన్ షాపులు, ఎనిమిది బార్లు ఉన్నాయి. పట్టణాల్లో గల్లీగల్లీలో, అలాగే దాదాపు అన్ని ఊళ్లలో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల బార్‌లను తలపించేలా ఏర్పాట్లు చేశారు. అంతటా బహిరంగంగానే మద్యం అమ్మకాలు నడుస్తున్నాయి. అయితే మద్యం ఆదాయం ఎందుకు పెరగలేదన్న దానికి రకరకాల కారణాలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. భూములు, ప్లాట్ల అమ్మకాలు పడిపోయాయి. అలాగే వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగాయే తప్ప ఆదాయం వృద్ధి చెందలేదు. అకాల వర్షాలతోపాటు తెగుళ్లతో పంటలు దెబ్బతినడం, ఆపై భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఆయా కారణాల వల్ల జనం వద్ద డబ్బుల సర్దుబాటుకు ఇబ్బందులు పెరిగాయి. చాలా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో గతంలోలాగా మద్యం తాగడానికి కొందరు వెనకా ముందవుతున్నట్లు తెలుస్తోంది.

### పెరిగిన గుడుంబా, గంజాయి విక్రయాలు..

మద్యం ధరలు పెరగడంతో చాలా మంది తక్కువ ధరల్లో లభించే మత్తు పదార్థాల వైపు మళ్లుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా అమ్మకాలు పుంజుకున్నాయి. అలాగే పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ యువత గంజాయికి అలవాటు పడుతున్నారు. సులువుగా గంజాయి లభిస్తుండడంతో యువకులు తక్కువ ధరల్లో దొరికే గంజాయితో మత్తు పీలుస్తున్నారు. దీనిని అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీస్ శాఖలు దాడులు నిర్వహిస్తున్నా దందా ఆగడం లేదు. గుడుంబా తయారీ, అమ్మకాలు కూడా యథేచ్ఛగా నడుస్తున్నాయి. గతంలో క్లోరోహైడ్రేట్‌తో తయారైన కల్లు దొరికేది. ఇప్పుడు చాలా ప్రాంతాల్లో కల్లులో అల్ప్రాజోలం వాడుతున్నారు. ఎక్కువ మత్తు ఇస్తుండడంతో చాలామంది మందు కల్లు తాగుతున్నట్టు తెలుస్తోంది. అలాగే జిల్లాకు పొరుగునే ఉన్న మహారాష్ట్రలో దేశీదారు తక్కువ ధరకు లభిస్తుంది. అక్కడి నుంచి అడ్డదారుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు దేశీదారు తరలివస్తోంది. వీటి ప్రభావంతోనూ జిల్లాలో మద్యం అమ్మకాలు పడిపోయినట్లు భావిస్తున్నారు.

### ఎన్నికలొస్తే పెరిగే అవకాశం!

రాష్ట్రంలో గతేడాది జరగాల్సిన గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయన్న నమ్మకం కూడా లేకుండాపోయింది. ఎన్నికల సీజన్‌లో సాధారణంగా మద్యం అమ్మకాలు రెట్టింపవుతాయి. అవి ఏడాది టార్గెట్‌ను సులువుగా రీచ్ చేయగలుగుతాయి. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపేవారు నెల రెండు నెలల ముందు నుంచే ప్రలోభాల పర్వం మొదలుపెడతారు. ముఖ్యంగా దావత్‌లతో ఆకర్శిస్తుంటారు. ఈసారైనా ఎన్నికలు వస్తాయేమోనని ఎక్సైజ్ శాఖ అధికారులు ఎదురుచూస్తున్నారు. టార్గెట్‌ను దాటాలంటే ఎన్నికలు రావలసిందేనన్న అభిప్రాయం ఆ శాఖ అధికారుల నుంచి వ్యక్తమవుతోంది.

# కరెంట్‌పోతే గొంతెండుడే!



ఎల్లారెడ్డిలో మరమ్మతులు లేక నిరుపయోగంగా ఉన్న చేతి పంపు



సింగిల్ ఫేజ్ మోటారుకు బిగించిన నల్లా ద్వారా వృథా అవుతున్న నీరు

- హ్యాండ్ బోర్లకు రిపేర్లు కరువు
- పట్టించుకోని బల్దియా అధికారులు
- కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు

**ఎల్లారెడ్డి:** జిల్లాలో హ్యాండ్ బోర్లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. మరమ్మతులు చేయించకపోవడంతో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా లేకపోతే గుక్కెడు నీళ్ల కోసం విలవిలలాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో గతంలో 254 హ్యాండ్ బోర్లు ఉండేవి. వాటిలో 80 పూడుకుపోగా 174 హ్యాండ్ బోర్లు పనిచేస్తున్నాయని అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. కానీ ఎక్కడా పనిచేస్తున్న దాఖలాలు లేవు. చిన్నచిన్న మరమ్మతులతో పనిచేసే అవకాశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 52.. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో 12 హ్యాండ్ బోర్లు పనిచేస్తున్నట్లు మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి వీటిలో రెండు మూడు కూడా పనిచేయడం లేదు. వెల్లుట్ల గ్రామపంచాయతీ పరిధిలో 5 హ్యాండ్ బోర్లు పనిచేస్తున్నాయని అధికారులు అంటున్నా గ్రామ పాఠశాలలోని చేతి పంపు తప్ప మరేదీ పనిచేయడం లేదని స్థానికులు అంటున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 9, 10 వార్డుల్లో నీటి సామర్థ్యం ఉన్న హ్యాండ్‌బోర్లు చెడిపోయి నెలలు కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. గతేడాది ఆగస్టు 20 న ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో రాత్రి బస చేసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి చేతిపంపుల మరమ్మతుల విషయం తీసుకెళ్లగా ఆయన తక్షణం ప్రైవేట్ మెకానిక్‌లతో బోర్లు రిపేర్లు చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ మరమ్మతులు చేయించలేదు.

### సింగిల్ ఫేజ్ మోటార్లను బిగించడంతో..

కొన్నిచోట్ల హ్యాండ్‌బోర్లను తొలగించి, సింగిల్ ఫేజ్ మోటార్లను బిగించారు. ఇలా చేయడంవల్ల ఎక్కువ నీరు వృథా అవుతోంది. ఒక్క బిందె నీరు అవసరమైనా స్థానికులు మోటార్ ఆన్ చేసి వదిలేస్తుండడంతో ఆ మోటార్ పరిధి కింద ఉండే అన్ని కుళాయిల నుంచి నీరు వృథాగా మురుగు కాలువల్లో కలుస్తోంది. దీంతో భూగర్భ జలాలు తగ్గి బోర్లు ఎత్తిపోతున్నాయి. మోటార్లు బిగించకుండా ఉండిఉంటే చేతిపంపులు చక్కగా పనిచేసేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చేతి పంపులకు రిపేర్లు చేయించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతులు చేయిస్తాం

ఎల్లారెడ్డి పట్టణంలో చెడిపోయిన బోర్ల వివరాలు సేకరిస్తున్నాం. త్వరలో ప్రైవేట్ మెకానిక్‌లతో వాటికి మరమ్మతులు చేయిస్తాం. హ్యాండ్ బోర్ల చుట్టూ 100 మీటర్ల దూరం వరకు ప్రైవేట్ బోర్లు వేయడం నిషిద్ధం. ఎవరైనా బోర్లు వేస్తుంటే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.
– మహేశ్ కుమార్, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్

# నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- కామారెడ్డి బల్దియాకు ఐదు కొత్త ట్యాంకర్లు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి క్రైం:** జిల్లాకేంద్రంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పట్టణ పరిధిలో నీటి సరఫరా కోసం రూ. 50 లక్షలతో కొనుగోలు చేసిన ఐదు ట్యాంకర్లను, రూ. 40 లక్షలతో కొనుగోలు చేసిన పొక్లెయిన్‌ను బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే 8 ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. పట్టణ విస్తీర్ణం పెరగడం, నీటి ఎద్దడి తలెత్తడంతో అదనంగా ఐదు ట్యాంకర్లను కొనుగోలు చేశామన్నారు. సమస్య ఎక్కువ ఉన్న ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు.



ట్యాంకర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

అనంతరం కార్యాలయంలో కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పరిశీలించారు. హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఉన్న మున్సిపల్ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, హౌజింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### 'పశు కల్యాణ సమితి' ఏర్పాటు

**కామారెడ్డి టౌన్:** జిల్లాలో పశువైద్య ఆస్పత్రులలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం జిల్లా పశు కల్యాణ సమితి ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పశు కల్యాణ సమితిని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కలెక్టర్ అధ్యక్షులుగా, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి సంజయ్ కుమార్ కన్వీనర్‌గా, డీపీవో మురళి, జెడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఎస్జీవో ప్రతినిధి శ్రీధర్ శర్మ, దోమకొండ పశువైద్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయం(ఎస్ఏఎస్‌సీఐ) పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించి పశు వైద్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ సమితి పనిచేస్తుందన్నారు. జిల్లాలోని పశువైద్య ఆస్పత్రుల నిర్మాణం, పునరుద్ధరణ, ఆధునిక పరికరాలు సమకూర్చడం, పశుసంక్షేమానికి అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి అనుసంధానంగా కార్యక్రమాలను అమలు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో మురళి, పశు వైద్యాధికారి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేటినుంచి అవగాహన సదస్సులు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి క్రైం:** భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన లింగంపేట్ మండలంలో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఇందులో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేసి, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి విధి విధానాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఎఫ్‌వో నిఖిత, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, అటవీ అభివృద్ధి అధికారి రామకృష్ణ, లింగంపేట్ తహసీల్దార్ సురేష్, ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సమావేశంలో పాల్గొన్న డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్ విక్టర్

**లింగంపేట మండలంలో..**

**లింగంపేట:** మండలంలో గురువారం నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. భూభారతి కోసం లింగంపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలుత అన్ని గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఆర్డీవో ప్రకటించారు. 17న పోతాయిపల్లి, బోనాల్ గ్రామాలలో సదస్సులు నిర్వహించనున్నారు. 19న బాయంపల్లి, కన్నాపూర్, 21న పర్మళ్ల, పొల్కంపేట, 22న ఎల్లారం, మెంగారం, 23న రాంపూర్, జల్దిపల్లి, 24న బాణాపూర్, కొర్పోల్, లింగంపల్లి(ఖుర్దు), 25న భవానీపేట, లింగంపేట, ముంబోజీపేట, 26న కంచుమల్, కొండాపూర్, 28న నల్లమడుగు, నాగారం, శెట్పల్లి సంగారెడ్డి, 30న శెట్పల్లి, మోతె గ్రామాల్లో సదస్సులు ఉంటాయి. రైతులు తమ భూసమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో సూచించారు.

### మండలాల వారీగా భూ భారతి సదస్సులు

**కామారెడ్డి క్రైం:** మండల కేంద్రాల్లో భూ భారతి అవగాహన సదస్సులను గురువారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడానికి నిర్వహించే ఈ సదస్సులు ఈనెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఒక సదస్సు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సదస్సు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి సదస్సుకు 200 లకుపైగా ప్రజలు హాజరయ్యేలా చూడాలని, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు.

**సదస్సుల వివరాలు..**

- ఈనెల 17 న ఉదయం పాల్వంచ రైతు కేంద్రంలో, మధ్యాహ్నం మాచారెడ్డి మండలం గజ్యా నాయక్ తండా రైతు వేదికలో కార్యక్రమాలు ఉంటాయి. 19 న ఉదయం ఎల్లారెడ్డి రైతు వేదికలో, మధ్యాహ్నం నాగిరెడ్డిపేట రైతు వేదికలో, 21 న ఉదయం పిట్లంలో, మధ్యాహ్నం పెద్దకొడప్‌గల్‌లో, 22 న ఉదయం రామారెడ్డిలో, మధ్యాహ్నం భిక్కనూరులో, 23 న ఉదయం గాంధారిలో, మధ్యాహ్నం సదాశివనగర్‌లో సదస్సులు నిర్వహిస్తారు.
- 24 న మూడు సదస్సులు ఉండనున్నాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కామారెడ్డి వీక్లీ మార్కెట్‌లోని మున్నూరు కాపు సంఘం భవనంలో, మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 వరకు తాడ్వాయి రైతు వేదికలో, 3.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వరకు రాజంపేట రైతువేదికలో సదస్సులు నిర్వహిస్తారు.
- 25 న ఉదయం జుక్కల్‌లో, మధ్యాహ్నం బిచ్కుంద శాంతి మున్నూరుకాపు ఫంక్షన్ హాల్‌లో, 26 న ఉదయం బీబీపేట్‌లో, మధ్యాహ్నం దోమకొండలో సదస్సులు నిర్వహించనున్నారు.
- 28 న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిజాంసాగర్ తహసీల్ కార్యాలయం ఆవరణలో, మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటల వరకు మహ్మద్‌నగర్‌లో, 3.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బాన్సువాడ రెడ్డి సంఘంలో భూ భారతి సదస్సులు నిర్వహిస్తారు. 29 న ఉదయం డోంగ్లీ తహసీల్ కార్యాలయం ఆవరణలో, మధ్యాహ్నం మద్నూర్‌లో, 30 న ఉదయం బీర్కూర్‌లో, మధ్యాహ్నం నస్రుల్లాబాద్‌లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.

# అకాల వర్షంతో తడిసిన ధాన్యం

కోమట్‌పల్లి, పోతాయిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. దీంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరద నీటిలో వడ్లు కొట్టుకుపోయాయి. ధాన్యం కుప్పల్లో నిలిచిన నీటిని తొలగించడానికి, కొట్టుకుపోయిన వడ్లను ఎత్తడానికి రైతులు నానా పాట్లు పడ్డారు. అధికారులు వెంటనే ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.
– లింగంపేట



కోమట్‌పల్లిలో వరదనీటిలో కొట్టుకుపోయిన వడ్లను ఎత్తుతున్న రైతులు

# పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం

**పెర్కిట్(ఆర్మూర్):** పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి రేషన్ లబ్ధిదారుడు లక్కారం తవ్వన్న ఇంట్లో సన్నబియ్యంతో మంత్రి బుధవారం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని తినేందుకు లబ్ధిదారులు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించి మార్కెట్‌లో సన్న బియ్యం కొనుగోలు చేసుకునే వారన్నారు. ప్రభుత్వానికి భారమైనా పేదలకోసం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## క్లుప్తంగా

### 23 వరకు డిగ్రీ ప్రాక్టికల్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రాక్టికల్ / ప్రాజెక్టు పరీక్షలను ఈ నెల 16 నుంచి 23 వరకు నిర్వహించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కె సంపత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్/ ప్రాజెక్టు పరీక్షలు నిర్వహించి వెంటనే మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సిందిగా కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

### కామర్స్‌లో డాక్టరేట్



కామర్స్ విభాగంలో డాక్టరేట్ సాధించిన రంజిత

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని కె రంజిత పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ కామర్స్ అధ్యాపకులు, రిజిస్ట్రార్ యాదగిరి పర్యవేక్షణలో 'అకౌంటింగ్ పాలసీస్ అండ్ ప్రాక్టీసెస్ ఇన్ మున్సిపల్ కార్పొరేషన్ – ఏ స్టడీ ఆఫ్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్, తెలంగాణస్టేట్' అనే అంశంపై రంజిత పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం మంగళవారం సమర్పించారు. రంజిత గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్ లో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం రంజితను వీసీ యాదగిరిరావు,రిజిస్ట్రార్ యాదగిరి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కామర్స్ డీన్ రాంబాబు, అధ్యాపకులు శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

### పరిమితికి మించి ప్రయాణం చేయొద్దు

ఖలీల్‌వాడి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేపటొద్దని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ ప్రసాద్ ఆటో డ్రైవర్లకు సూచించారు. నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో ఆటో డ్రైవర్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. డ్రైవర్ సీటు పక్కన మరో సీటు పెట్టవద్దని, విధిగా యూనిఫామ్ ధరించాలన్నారు. ఎక్కువ ప్యాసింజర్లను ఎక్కించుకోరాదని, నంబర్ల ప్లేట్ లేని ఆటోలను నడపరాదని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు.

### ఇన్‌చార్జి మంత్రిని కలిసిన సీపీ



మంత్రికి పూలమొక్కను అందజేస్తున్న సీపీ

నిజామాబాద్‌అర్బన్/ ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును సీపీ సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యలపై స్పందించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే ఐజే యూ నాయకులు ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం అందజేశారు.



# పారిశుధ్య కార్మికులకు భద్రతేది..?

- ఉత్త చేతులు, కాళ్లతో మురికి కాలువల్లో, రోడ్లపై చెత్త తొలగింపు
- అనారోగ్యం బారిన పడుతున్న బల్దియా కార్మికులు
- సబ్బులు, నూనెలు, గ్లౌజ్‌లు, బూట్లు ఇవ్వని అధికారులు





పట్టణంలో సిరిసిల్ల రోడ్డులో మురికి కాలువలో దిగి శుభ్రం చేస్తున్న కార్మికుడు

కామారెడ్డి టౌన్: పారిశుధ్య కార్మికుల భద్రతను బల్దియా అధికారులు పట్టించుకోవడంలేదు. వారికి విధుల్లో భాగంగా సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు, షూ, చేతి గ్లౌజ్‌లు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడం లేదు. 9నెలల క్రితం కేవలం రెండు జతల దుస్తులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో కార్మికులు మురికి కాలువల్లో, రోడ్లను శుభ్రం చేసే పనుల్లో చేతికి గ్లౌజ్‌లు, కాళ్ల షూ లేకుండా పనులు చేయడంతో అనారోగ్యపాలవుతున్నారు.పాలక వర్గం ముగిసి ప్రత్యేకపాలన వచ్చిన పరిస్థితిలో ఎలాంటి మార్పులేదని కార్మికులు వాపోతున్నారు. బుధవారం పట్టణంలోని సిరిసిల్లారోడ్‌లో నిలిచిన మురుగు నీటిలో కార్మికుడు దిగి పూడికను శుభ్రం చేశాడు. సంరక్షణగా చేతులకు ఎలాంటొ గ్లౌజ్‌లు, కాళ్లకుబూట్లు లేకుండానే పని చేశాడు.

**టెండర్‌లో భారీ కుంభకోణం ఆరోపణలు**

కామారెడ్డి మున్సిపల్ శానిటేషన్ విభాగంలో 256 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతి ఏటా వీరికి సబ్బులు, నూనెలు, ఆర్పన్స్, చెప్పులు,షూ పంపిణీ చేయాల్సి ఉంటుంది. వీటిని కార్మికులకు ఇచ్చేందుకు ఏటా టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా కాకుండా అత్యవసరం పేరిట మూడు, నాలుగు ఏళ్లకు ఒక సారి పంపిణీ చేస్తున్నారు. ఓ ఏడాది ప్రజాప్రతినిధి బినామి పేరిట టెండర్ వేసి భారీ కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ. లక్షల్లో బిల్లులు తీసుకుని కేవలం దుస్తులు మాత్రమే పంపిణీ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులను పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

### త్వరలో కార్మికులకు అందజేస్తాం



కార్మికులకు త్వరలో సబ్బులు, నూనెలు ఇతర సామాగ్రి అందజేస్తాం. అన్ని అందేలా చర్యలు తీసుకుంటాం. 8 నెలల క్రితం దుస్తులను పంపిణీ చేశాం. ఆర్థికం సంక్షోభంతో కాస్తా ఇబ్బందులు ఉన్నాయి. త్వరలోనే కార్మికులకు అన్ని వస్తువులను అందజేస్తాం. – రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

# ఉద్యానవన పంటలతో రైతులకు లాభాలు



తాడ్వాయి శివారులో మునగ పంటను పరిశీలిస్తున్న సురేందర్

- తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి
- డీఆర్‌డీవో సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పథకంలో ఉద్యానవన పంటలను పెంచుకునే అవకాశముందని, ఉద్యానవన పంటలు రైతులకు ఎంతో లాభదాయకమని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. ఆయన బుధవారం తాడ్వాయి శివారులో ఉద్యానవన పంటలో భాగంగా వేసిన మునగ పంట పెంపకంను పరిశీలించారు. మొక్కల పెంకం, మునక్కాయల దిగుబడిని రైతును అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి సుమారు వేయి మొక్కల చొప్పున రెండు ఎకరాలలో రెండువేల మొక్కలను నాటామని, క్వింటాల్ మునగ కాయకు మార్కెట్లో రూ. 2వేలు వస్తాయని రైతు సమధానం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 400ఎకరాలలో ఉద్యానవన పంటలను పెంచుకునేందుకు అవకాశముందని, ఆసక్తిగల రైతులు ముందుకు రావాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశముందని తెలిపారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంటులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో కూలీల సంఖ్యను పెంచాలని, కూలీరేటు రూ.307వచ్చేలా చూడాలన్నారు. పండ్ల తోటల పెంపకం నిమిత్తం ప్రతి గ్రామం నుంచి ఒకరి నుంచి ఐదుగురి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో కృష్ణగౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వామి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేసవి సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మల్లారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వేసవి సెలవుల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో బుధవారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. చెరువులకు ఈతకు వెళ్లకూడదన్నారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గీతతోపాటు షీ టీం బృందం సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : సైబర్ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై అబీద్ బేగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సంతలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోతలు ముగిసి డబ్బులు ఖాతాల్లో వచ్చే సమయమని, తమ బ్యాంక్ ఖాతా వివరాలను తెలియజేయవద్దని సూచించారు.ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

### పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను బుధవారం బాధితునికి అప్పగించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. పాల్వంచ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి నర్సింలు పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి అందజేసినట్లు వివరించారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టి బొమ్మ దహనం



జిల్లా కేంద్రంలో ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్ : నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అనుచితమైన కేసులు నమోదు చేశాయని ఆరోపిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ప్రజా సమస్యలపైన మోడీని నిలదీస్తున్నందున కక్ష పూరితంగా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్, యువజన అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ సెల్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు రాజాగౌడ్, బ్రహ్మానందరెడ్డి, పంపర లక్ష్మణ్, చాట్ల రాజేశ్వర్, శివకుమార్,నర్సింలు, అంజాద్, బట్టు మోహన్, తేజపు ప్రసాద్,ఎల్. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి



టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని కామారెడ్డి జిల్లా ఏబీవీపీ పూర్వ నాయకులు బుధవారం తిరుపతిలో టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని భిక్కనూరు సిద్ధ రామేశ్వరాలయం, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి, ఇసన్నపల్లి కాలభైరవస్వామి ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ నాయకులు రణజీత్ మోహన్, జంగం నరేష్, కోడేం లక్ష్మీపతి, వంగా రాహుల్, సంతోష్‌గౌడ్ తదితరులున్నారు.

# కాచాపూర్ గ్రామ సమస్యలు పరిష్కరించాలి



సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన పలువురు యువకులు అధికారులను కోరారు. బుధవారం తహసీల్దార్ శివప్రసాద్ తో పాటు ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సిమెంటు రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, ఇరిగేషన్ ప్రధాన కాలువ పిచ్చి మొక్కలతో నిండి పోయిందని, తాగునీటి లీకేజీలు అధికంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంఎస్ఎన్ కంపెనీ ద్వారా దుర్వాసన గ్రామంలోకి వస్తుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మానవ హక్కుల కమిటీ చైర్మన్ మహిపాల్, జిల్లా వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింలు, గ్రామ బీజేపీ అధ్యక్షులు అనిల్, మండల బీజేపీ ఉపాధ్యక్షులు శంకర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, గ్రామ సేవా సమితి సభ్యులు మోహన్ గౌడ్, నవీన్ చారి స్వామి ఉన్నారు.

# చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు



తహసీల్దార్ రేణుక చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు



మట్టిని తీస్తున్న పొక్లెయిన్

- నిలిపివేయాలని తహసీల్దార్‌కు నాగ్లూర్ గ్రామస్తుల వినతి
- నిలిపివేస్తామని హామీ పత్రం ఇచ్చిన ఇరిగేషన్ ఏఈ వంశీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని నాగ్లూర్ చెరువు నుంచి కొందరు నాయకులు అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్నారని నాగ్లూర్ గ్రామస్తులు అన్నారు. మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ రేణుక చౌహాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈవిషయమై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అలాగే చెరువు కట్టపై ఉన్న దారిని ఆక్రమించారని వారు ఆరోపించారు.

ఇరిగేషన్ ఏఈ వంశీ నిర్లక్ష్యంతో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి చెరువులో నుంచి మట్టిని తరలించకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ వంశీ గ్రామస్తులకు హామీ పత్రం రాసి ఇచ్చారు. చెరువు ను సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. వీలైనంత తొందరగా సర్వే చేయించి చెరువు విస్తీర్ణం నిర్ణయించాలని గ్రామస్తులు కోరారు.

# ఉమ్మడి కుటుంబ సంస్కృతి కొనసాగాలి



లక్కారం తవ్వన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెర్కిట్(ఆర్మూర్): ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతుండడంతో ఆనందానికి దూరమవుతున్నారని, ఉమ్మడి కుటుంబ సంస్కృతి కొనసాగాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లికి చెందిన లక్కారం తవ్వన్న ఉమ్మడి కుటుంబంతో కలిసి సన్నబియ్యంతో భోజనం చేసిన మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మంత్రి వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పొద్దుటూరి వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, మారుతిరెడ్డి, రవిగౌడ్, కాశీరాం, కొంతం మురళీధర్ తదితరులు ఉన్నారు.

### పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడికి వచ్చే బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ సిబ్బందికి సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపం నివారించడానికే జాతీయ పోషణ పక్షం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏడవ జాతీయ పోషణ పక్షం-2025 కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ హాజరై మాట్లాడారు. పిల్లల్లో ఉబకాయాన్ని తగ్గించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఉండే విధంగా చూసుకోవాలన్నారు. జిల్లా ఆయుష్ కో-ఆర్డినేటర్ సాయగౌడ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్(26) పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. గత నెల 18న పశువుల గడ్డి కోసం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. భార్య శశిరేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామ శివారులోని కాసిరెడ్డి చెరువు సమీపంలో అస్థి పంజరం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఘటన స్థలిలో దొరికి కొడవలి, షర్ట్, ప్యాంట్ ఆధారంగా శ్రీనివాస్ మృతదేహంగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

రామారెడ్డి:మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపి న వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కుమ్మరి సత్తయ్య (30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత నాలుగు నెలలుగా అతనికి మతిస్థిమితం కోల్పోడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు.బుధవారం వేకువజామున గ్రామ పల్లె ప్రకృతి వనంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి కుమారుడి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. స్టేషన్ సమీపంలోని చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ. 3,100 నగదు, ఐదు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

# చికిత్స పొందుతూ ఒకరి మృతి



కమ్మరి పండరి(ఫైల్)

పెద్దకొడప్‌గల్: బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ పండరి ఈ నెల 10న అంజని గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహం కార్యక్రమంలో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. రోడ్డుపై ధాన్యం కుప్పలు ఉండడాన్ని గమనించని అతను వాటిపై ప్రయాణించడంతో కిందపడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

**తాడ్కోల్‌లో మరో వ్యక్తి..**

బాన్సువాడ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ అశోక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ మండలం తాడ్కోల్‌కు చెందిన కుర్మసాయిలు (51) గ్రామంలో పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 9న కుమార్తె వివాహం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సాయిలు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు నిజామాబాద్‌కు తరలించిగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

రామారెడ్డి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల చంద్రకాంత్(23) ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకోగా బుధవారం వేకువజామున తల్లి అతన్ని లేపగా చలనం లేకుండా ఉండడంతో మృతి చెందినట్లు గుర్తించారు. తండ్రి రాజమల్లు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

### అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



ఎల్లారెడ్డి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. మహ్మద్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్‌రెడ్డి ట్రాక్టర్ నిజాంసాగర్ కెనాల్ నుంచి అక్రమంగా ఇసుకను ఎల్లారెడ్డి మండలం ఆజామాబాద్ గ్రామానికి తరలిస్తుండగా అన్నాసాగర్ శివారులో ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. మద్నూర్ మండలం కుర్ల గ్రామానికి చెందిన తూకమణి అలియాస్ పంచశీల అనే మహిళ 2019 ఆగస్టు 12న హత్యకు గురైంది. ఆమె కుమారుడు శెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుడు అదే గ్రామానికి చెందిన బాగెలివార్ సంతోష్‌గా గుర్తించారు. మృతురాలికి అప్పట్లో సంతోష్‌తో పరిచయం ఏర్పడడంతో చనువుగా ఉండేవారు. సంతోష్‌కు పెళ్లి సంబంధాలు వస్తుండటంతో తూకమణి తననే పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో నిందితుడు సంతోష్ ఆమెను హత్య చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు గతంలోనే సంతోష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.4 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐలు సాజిద్, నరేశ్, ఎస్సైలు అశోక్ కుమార్, విజయ్ కొండా, పోలీసుల తరఫున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, లైజనింగ్ అధికారి మురళి, కానిస్టేబుల్ సాయి, కృష్ణలను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

### పశువుల వాహనం బోల్తా

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామ శివారులో పశువులతో కూడిన ఓ వాహనం బోల్తాపడటంతో వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. సాటాపూర్ నుంచి హైదరాబాద్ వైపు పది ఎడ్లను వ్యానులో తీసుకెళ్తుండగా ప్రమాదం చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పశువుల అక్రమ తరలింపుపై బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు.

### న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలు

వర్ని: వర్ని పీఎస్ పరిధిలోని గోవూరు గ్రామానికి చెందిన కుదుముల గంగాధర్ మద్యం మత్తులో డయల్-100కు పలుమార్లు కాల్ చేసి ఇబ్బంది పెట్టినందుకు గాను బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఈనెల 14న డయల్-100కు ఫోన్ చేసి ఇష్టానుసారంగా మాట్లాడి వారి సమయాన్ని వృథా చేసినందుకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.